# సేవాఫలం

**వై. కె. మూర్తి**

సూర్యం మనసంతా సంతోషంగా వుంది. ఇంకో వారం రోజుల్లో అతను ఓ ప్లాటుకు సొంతదారుడు కాబోతున్నాడు.

నిజానికి అతను సొంతంగా ఓ ఇల్లు కట్టుకోవాలని ఎన్నాళ్ళనుంచో కలలు కంటున్నాడు. ముందుగా ప్లాటుకోసం డబ్బు దాస్తూ వచ్చాడు. అది ఈ నాటికి లక్షన్నరయింది. డబ్బు మొత్తం చెల్లించే పక్షంలో ప్లాటు రిజిష్టరు చేయించి ఇస్తానని ప్లాటు ఓనర్ అన్నాడు. కనుక ప్లాటు ధరతో పాటు రిజిస్ట్రేషన్ ఖర్చులకు కూడా తాను దాచుకున్నది సరిపోతుంది. ఇంకా రెండేళ్లు కాస్త డబ్బులు దాచుకుని, తర్వాత బ్యాంకు లోను తీసుకొని ఇల్లు కట్టడం ప్రారంభించాలి.

ఇల్లు తాళం వేసి ఉండటం చూసి ప్రక్కింట్లో అడిగాడు.

"మీ నాన్నగారికి ఆయాసం ఎక్కువైతే జానకి హాస్పిటల్‌కి తీసుకెళ్ళిందండీ. ఆయన్ను అడ్మిట్ చేసుకొన్నారనీ, మీరు రాగానే పంపమని ఇందాకే ఫోన్ చేసి చెప్పింది" ప్రక్కింటావిడ తాళం చెవులిస్తూ చెప్పింది.

"ఏ హాస్పిటల్?"

ఆమె చెప్పింది. వెంటనే హాస్పిటల్ చేరుకున్నాడు. బయటే వున్న జానకిని అడిగాడు. "నాన్నగారికెలా వుంది? డాక్టరుగారేమన్నారు?"

"ఇంకా అలాగే వుంది. ఆయాసం వల్ల ఊపిరి పీల్చడం కష్టమౌతున్నది.ఐ.సి.యు.లో వున్నారు. ముందు పదివేలు కట్టమంటున్నారు. మీ కోసం ఆఫీసుకు ఫోన్ చేస్తే బయటకు వెళ్ళారని చెప్పారు."

"అవును. ప్లాటు విషయం గురించి రావుగారింటికి వెళ్ళాను."

"ఏమన్నారు ?" ఆతృతగా అడిగింది.

"తర్వాత చెప్తాలే. ముందు బ్యాంకుకెళ్ళి డబ్బు డ్రా చేయాలి. నాన్నగారిని చూస్తూండు." వాచీ చూసుకుంటూ బయటకు నడిచాడు సూర్యం.

★ ★ ★ ★ ★

ఈజీ చైర్‌లో కళ్ళు మూసుకొని పడుకొని వున్న సూర్యాన్ని చూస్తున్న జానకి మనసు జాలితో నిండిపోయింది. ప్లాటు కొనాలని ఎన్నో ప్రయత్నాలు చేసి, ఎక్కడెక్కడో తిరిగి తీరా అతని కల నిజమయ్యే సమయానికి తండ్రి అనారోగ్యంతో హాస్పిటల్ పాలవడం, లక్ష రూపాయలు మంచి నీళ్ళలా ఖర్చయిపోవడం ఒక దెబ్బైతే, అతని తండ్రి కూడా దక్కకపోవడం ఇంకా పెద్ద దెబ్బైంది. డబ్బు గురించి బాధపడకుండా, తండ్రి ఆరోగ్యం గురించే తపించిన అతని వ్యక్తిత్వానికి, మంచితనానికి మనసులోనే అభినందించింది జానకి.

ఇంతలో "నాయనా సూర్యం" అంటూ వచ్చిన శర్మగారిని ఇద్దరూ లోపలికి ఆహ్వానించారు. ఆయన సూర్యం తండ్రికి స్నేహితుడు. ఇద్దరూ ఒకే డిపార్ట్‌మెంట్‌లో కలిసి పనిచేసి రిటైరైనారు. "సూర్యం నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలయ్యా. ఇరవై ఏళ్ళకిందట మేమంతా ప్లాట్లు చేసుకోవడానికి స్థలం కొనడం, దానికి కొన్ని అడ్డంకులు వచ్చి లేఅవుట్ అప్రూవ్ కాకపోవడం, కోర్టులో కేసు జరగడం నీకు తెలిసిన విషయమే. దానిపై మేమంతా ఆశ కూడా వదులుకున్నాము. కాని ఇప్పుడు అది అప్రూవ్ అయి గవర్నమెంటు పర్మిషన్ కూడా వచ్చేసింది. ఇంకో నెలరోజుల్లో ప్లాట్లు వేయడం, మెంబర్లందరికీ కేటాయించడం జరుగుతుంది. మీనాన్న ఆనాడే పదివేలు కట్టేశాడు కనుక ఆయన పేర కూడా ఒక ప్లాటు వుంటుంది. ఆయన ఏకైక వారసుడిగా అది నీకు వస్తుంది. నీవు రిజిస్ట్రేషన్ ఖర్చులు మాత్రం పెట్టుకుంటే చాలు. ఇప్పుడు అక్కడ ప్లాటు విలువ ఏడు లక్షలుంటుంది తెలుసా ?"

చెప్పడం ఆపి సూర్యం వంక చూశారాయన. సూర్యం ఆనందంతో మాట రాక ఆనందబాష్పాలతో తండ్రి ఫోటో వంకే చూస్తున్నాడు కృతజ్ఞతాభావంతో.

శర్మగారు అతని భుజం తడుతూ "నిస్వార్థంగా తల్లిదండ్రులకు చేసిన సేవలు, త్యాగాలను భగవంతుడు తప్పక గుర్తిస్తాడయ్యా" అన్నారు తానూ మిత్రుడిని తలుస్తూ.


వార్షిక సంచికతో

కలిపి 13 సంచికలు

సాలుకి చందా

రూ. 100/-

యం.ఓ., డి.డి, ఆన్‌లైన్ ద్వారా చందాలు

చినుకు సాహిత్య మాసపత్రిక పేరుమీద

పంపించండి.